క్లుప్తంగా

మలేరియా, డెంగీ బాధితులను గుర్తించండి



రికార్డులు తనిఖీ చేస్తున్న కామేశ్వరరావు

నంద్యాలటౌన్: గ్రామీణ ప్రాంతాల్లో మలేరియా, డెంగీ లక్షణాలతో బాధపడేవారిని గుర్తించి వారికి సత్వరమే సరైన చికిత్స అందించాలని జిల్లా మలేరియ అధికారి కామేశ్వరరావు సూచించారు. బుధవారం మండలంలోని చాపిరేవుల గ్రామ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. హెల్త్ సెంటర్ పరిధిలో ఏవైనా మలేరియా లేదా డెంగీ కేసులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. మలేరియా, డెంగీ పరీక్షలు నిర్వహించిన రికార్డులు తనిఖీ చేశారు.

భక్తిశ్రద్ధలతో గంధం

చాగలమర్రి: స్థానిక చిన్నమకానం వీధిలో వెలసిన శ్రీగౌసేపీర్‌షా ఖాద్రీ స్వామి వారికి బుధవారం గంధం, గురువారం ఉరుసు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పీఠాధిపతి శ్రీలాలుమియ్యాషా ఖాద్రీ తెలిపారు. గంధం కార్యక్రమంలో భాగంగా బుధవారం రాత్రి స్వామివారికి నాయీ బ్రాహ్మణ కాలనిలోని సుబ్బన్న ఇంటి నుంచి గంధంను ఫక్కీర్లు వేళతాళాలతో ఉరేగింపుగా దర్గాకు తీసుకొచ్చారు.

మోటారు దొంగల అరెస్ట్

శిరివెళ్ల: శిరివెళ్ల మెట్ట వద్ద బుధవారం వాహనాల తనిఖీ చేస్తుండగా మోటారు సైకిల్‌పై ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించడంతో విచారించగా.. మండలంలోని పలు గ్రామాల్లో వ్యవసాయ మోటార్లను దొంగిలించినట్లు తేలిందని ఎస్‌ఐ సురేష్ బుధవారం తెలిపారు. యర్రగుంట్ల గ్రామానికి చెందిన ఇండ్ల ఆంజనేయులు, దాసరి లక్ష్మయ్య వీరిద్దరూ ఆళ్లగడ్డ, రుద్రవరం మండలం నర్సాపురం, శిరివెళ్ల మండలం యర్రగుంట్ల గ్రామ శివారుల్లోని పంట పొలాల్లో చోరీ లకు పాల్పడ్డారని వివరించారు. వారు మోటారు సైకిల్‌పై నంద్యాల వైపు మోటార్లను అమ్ముకోవడానికి వెళ్తూ పట్టుబడ్డారు. వారి నుంచి రెండు మోటార్లు, రెండు కిర్లోస్కర్ ఆయిల్ ఇంజిన్లు, ఒక చోలా కంపెనీ మోటారు, ఇరవై కిలోల బట్టపైపు, వైర్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపామన్నారు.

ప్రాజెక్టులపై చంద్రబాబుకు అవగాహన లేదు

నంద్యాల(అర్బన్): వ్యవసాయం దండగ అన్న మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రాజెక్టుల గురించి అవగాహన లేదని ఏపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతల మోహన్ రావు విమర్శించారు. ఇటీవల నందికొట్కూరు నియోజకవర్గంలో పర్యటనలో నీటి ప్రాజెక్టుల మీద అబద్ధాలు చెబుతూ రాయలసీమ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. చింతలయ్య, ఎస్‌వైడీ ప్రసాద్, శివారెడ్డి, సుబ్బయ్య పాల్గొన్నారు.

బీమా తక్షణ సాయం అందజేత

నంద్యాల(సిటీ): పట్టణంలోని 42 వ వార్డులో నివసిస్తున్న దేశెట్టి వసంత్ ఇటీవల బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. మృతుడు వైఎస్సార్ బీమా లబ్దిదారులు కావడంతో తక్షణ సాయం కింద రూ.10వేలను ఆయన భార్య దేశెట్టి రమాదేవికి 42వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ కిరణ్ కుమార్ అందజేశారు. బింగి సుధాకర్, అధికారులు పాల్గొన్నారు.

గిరిజనుల అభివృద్ధికి కృషి చేయాలి

నంద్యాల(అర్బన్): ఫారెస్ట్ అధికారులు గిరిజనుల అభివృద్ధికి కృషి చేయాలని ఆలిండియా బంజారా సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు బాలు నాయక్ కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నుంచి అడవిలో ఆవులను మేపుతూ జీవనం సాగిస్తున్న వెలుగోడు గట్టు తండా గిరిజనుల పట్ల ఫారెస్ట్ అధికారులు ఆవులను అడవిలోకి మేతకు పోనివ్వకుండా అడ్డుకోవడం తగదన్నారు. ఆవులను మేపడానికి వెళ్లిన గిరిజన మహిళపై దౌర్జన్యం చేయడం ఫారెస్ట్ అధికారులకు తగదని ఏపీ గిరిజన ప్రజా సమైఖ్య రాష్ట్ర అధ్యక్షులు రాజు నాయక్ అన్నారు.

పింగళి వెంకయ్యకు నివాళి

నంద్యాల(వ్యవసాయం): స్వాతంత్ర సమరయోధుడు, జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య 147వ జయంతిని పురస్కరించుకుని స్థానిక శ్రీ పింగళి సూరన స్మారక శాఖ గ్రంథాలయంలో బుధవారం రిటైర్డ్ లైబ్రేరియన్ సుబ్బారావు ఆధ్వర్యంలో ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కొమ్మాశ్రీ హరి, మల్లికార్జున, సుబ్బరాయుడు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలపై ఉద్యమిస్తాం

నంద్యాల(న్యూటౌన్): మణిపూర్ సంఘటనపై ప్రధానమంత్రి మోదీ పార్లమెంట్‌లో సమాధానం చెప్పలేకపోతున్నారని, కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై సీపీఐ ఆధ్వర్యంలో బస్సు జాత కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఓబులేసు, రామచంద్రయ్య, జగదీష్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశానికి హాజరైన నాయకులు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.

నులిపురుగు నివారణపై ప్రచారం చేయాలి

నంద్యాల(న్యూటౌన్): ఈ నెల 10వ తేదీన జాతీయ నులిపురుగు నివారణ దినోత్సవం సందర్భంగా అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లోని విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు విస్తృత ప్రచారం నిర్వహించాలని డీఈఓ సుధాకర్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 3–9 వ తేదీ వరకు నులి పురుగుల నివారణ గురించి పాఠశాలల్లో చర్చించి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించాలని, ఏఎన్‌ఎంలు, మెడికల్ ఆఫీసర్లతో 7– 10 వ తేదీ వరకు అల్బెండోజల్ మాత్రలు పంపిణీ చేయాలని ఆదేశించారు.

తక్కువ ఖర్చుతో సమగ్ర సస్యరక్షణ

- జీవ నియంత్రణ పద్ధతులతో.. పలు రకాల తెగుళ్లకు ప్రారంభంలోనే అడ్డుకట్ట
- రసాయన ఎరువులతో తలెత్తే దుష్పరిణామాలకు చెక్
- నంద్యాల జీవనియంత్రణ ప్రయోగశాలలో అందుబాటులో జీవమందులు



ప్రయోగశాలలో పరీక్షలు చేస్తున్న ఏవో శశికళ,



రసాయనాల మిళితాన్ని పరిశీలిస్తున్న ఏఓ కళ్యాణ్

నంద్యాల(సెంట్రల్): పంటలను ఆశించే తెగుళ్ల నివారణలో భాగంగా అన్నదాతలు రసాయన ఎరువలను విచక్షణా రహితంగా వాడుతుండటంతో ప్రజారోగ్యానికి, పర్యావరణానికి పెనుముప్పు వాటిల్లుతోంది. ఈ సమస్యకు చక్కని పరిష్కారంగా జీవనియంత్రణ పద్ధతుల్ని సూచిస్తున్నారు వ్యవసాయ శాఖ అధికారులు. వీటితో తెగులు వ్యాపించినప్పుడ చేపట్టే చర్యల కన్నా నివారణ చర్యలే ఉత్తమమని ఇందుకు విత్తు దశలోనే జీవ మందులతో శుద్ధి చేయాలని చెబుతున్నారు.

ఆదిలోనే అంతం చేయాలి..

నంద్యాల జిల్లా వ్యాప్తంగా ఎక్కువగా వరి, మొక్కజొన్న, కంది, శనగ, వేరుశనగ, సోయాతో పాటు ఉద్యాన పంటలైన మిరప, పసుపు, కూరగాయలు సాగు చేస్తారు. వీటిలో ప్రధానంగా వేరుకుళ్లు, కాండం కుళ్లు, ఆకుముడత, ఎండుతెగులు, మాగుడు తెగులు, ఆకుమచ్చ, పాడతెగుళ్లు అధికంగా కనిపిస్తాయి. వీటి నివారణలో జీవ మందులైన ట్రైకోడెర్మావిరిడి, సూడోమోనస్ ఫ్లోరోసెన్స్, లింగాకర్షక బుట్టలు, ట్రైకోగామా బదనికలు తదితర పద్ధతులు ప్రభావవంతమైన ఫలితాలనిస్తాయి. ముఖ్యంగా తెగులు వ్యాపించిన తర్వాత నివారణకు ఉపక్రమించే కన్నా విత్తు దశలోనే వీటిని కట్టడి చేయవచ్చు. దీనికోసం జీవమందులతో విత్తనశుద్ధి చేయాలి.

ట్రైకోడెర్మావిరిడి..



ట్రైకోడెర్మావిరిడి రైతులకు మేలు చేసే ఓ రకం శిలీంద్రం. పలు పైర్ల పెరుగుదలకు సహకరించటంతో పాటు హానికారక శిలీంద్రాల్ని అదుపులో ఉంచటంలో సహాయపడుతుంది. వేర్లకు కవచంలా ఉండి రోగనిరోధక శక్తినివ్వటంతో పాటు నులిపురుగుల బెడదను నివారించి నాణ్యమైన దిగుబడుల్ని అందించటంలో ప్రధానపాత్ర పోషిస్తుంది.

వాడే విధానం..

కిలో విత్తనానికి 8–10 గ్రాముల ట్రైకోడెర్మావిరిడి పొడిని కలిపి వెంటనే విత్తుకోవచ్చు. భూమిలో చల్లాలంటే ఎకరాకు 90 కిలోల మాగిన పశువుల ఎరువు, 10 కిలోల వేపపిండి, 4 కిలోల విరిడిని మిశ్రమం చేయాలి. దీన్ని చెట్ల నీడలో కాని, పశువుల పాకలో కుప్పగా వేసి పైన కిలో బెల్లం కలిపిన నీటిని చిలకరించి గోనెసంచితో కప్పి ఉంచాలి. వారం రోజుల తర్వాత తీస్తే పసుపు, తెలుపు రంగులో ట్రైకోడెర్మావిరిడి బూజు రూపంలో కనిపిస్తుంది. ఈ మిశ్రమాన్ని పొలంలో చల్లి కలియదున్నాలి. దీనివల్ల శిలీంద్ర కారక తెగుళ్లయిన వేరుకుళ్లు, దుంప తెగులు, మొదలుకుళ్లు తదితర రుగ్మతల్ని ప్రాథమిక దశలోనే అరికట్టవచ్చు.

సుడోమోనస్‌ఫ్లోరోసెన్స్..



ఇది బ్యాక్టీరియా తరగతికి చెందినది. ఇది వ రిపంటను ఆశించే ఆకుమచ్చ తెగులు, పాడతెగులు, మిరపలో మాగుడు తెగులు, అరటిలో పనామా తెగులు, నువ్వు పంటలో వేరుకుళ్లు, వేరుశనగలో ఆకుమచ్చ తెగులు, చెరకులో ఎర్రకుళ్లను సమర్థవంతంగా అడ్డుకుంటుంది. దీనిలోని శక్తివంతమైన బ్యాక్టీరియా వేరు, ఆకుల నుంచి మొక్క కణ వ్యవస్థ ద్వారా ప్రవేశించి పైరులో వ్యాధినిరోధక శక్తిని పెంచి పంట పెరుగుదలకు సహాయపడుతుంది.

వాడే విధానం..

విత్తనశుద్ధి కోసమైతే కిలో విత్తనానికి 8–10 గ్రామల పొడిని కలిపి విత్తుకోవాలి. భూమిలో వేయటానికి ఎకరాకు 3 కేజీల పొడి, 90 కిలోల మాగిన పశువుల ఎరువు, 10 కిలోల వేపపిండి కలిపి నీడలో ఉంచి తరచుగా నీటిని చిలకరిస్తూ ఉండాలి. వారం తర్వాత తీసి తేమ ఉన్న పొలంలో వెదజల్లాలి. పిచికారీ కోసం ఎకరాకు 1–2 కేజీలు పొడి 150–200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

జాగ్రత్తలు

- రసాయన ఎరువులు, పురుగు మందులతో కలిపి వీటిని వాడకూడదు
- ఎండ, వేడి తగలని ప్రదేశాల్లో నిల్వ చేయాలి
- సూడోమోనస్ వాడినప్పుడు భూమిలో తగినంత తేమ ఉండాలి.

ట్రైకోగమ్మ కందిరీగ..

ట్రైకోగమ్మ అనేది సూక్ష్మ కందిరీగ జాతికి చెందిన గుడ్డు పరాన్నజీవి. గుడ్డు దశలో పురుగును నివారించటానికి ఇది దోహదపడుతుంది. పంటపై శనగ పచ్చ పురుగు లేదా లెపిడెప్టెరా జాతికి చెందిన పురుగుల గుడ్లను గమనించిన వెంటనే ఇది తన గుడ్లను శరీరం వెనక భాగాన ఉన్న కొండితో గుచ్చి పురుగు గుడ్లలో వదులుతుంది. ఇలా వృద్ధి అయిన ట్రైకోగమ్మ పరాన్నజీవుల గుడ్ల సొనను తిని నాశనం చేసి హానికారక పురుగుల సంతతిని నిర్మూలిస్తుంది.

వాడే విధానం..

ఇవి పోస్టల్ కార్డు రూపంలో ఉంటాయి. ఒక్కో కార్డులో 8 ముక్కలుంటాయి. ముక్కలో 15–20 వేల వరకు కందిరీగ గుడ్లు ఉంటాయి. కార్డును కత్తిరించి పొలంలో అక్కడక్కడా సూర్యరశ్మి నేరుగా తగలకుండా ఆకు అడుగుభాగంలో పిన్ చేయాలి. లింగాకర్షక బుట్టలతోనూ చక్కని ప్రయోజనాలు ఉన్నాయి. వరిలో కాండం తొలిచే పురుగులు, ఆకుముడత నివారణ కోసం 11–12 మీటర్లకు ఒకటి చొప్పున ఎకరాకు 15–20 బుట్టలను అమర్చాలి. ఇందులోని జీవ పదార్థం రెండు తెగుళ్లకు వేరుగా ఉంటుంది. కాబట్టి వ్యాధుల ఉధృతిని బట్టి మార్చుకోవాలి. దీనివల్ల మగ పురుగులు బుట్టలకు ఆకర్షితమై ఇందులో ఇరుక్కుంటాయి. మరుసటిరోజు వీటిని తీసి నాశనం చేయటం వల్ల తెగుళ్ల బారినుంచి కాపాడుకోవచ్చు.

తక్కువ ధరలో అందుబాటులో

నంద్యాల జీవనియంత్రణ ప్రయోగశాలలో జీవమందుల్ని తక్కువ ధరల్లో ప్రభుత్వం అందుబాటులో ఉంచింది. ట్రైకోడెర్మావిరిడి కిలో రూ.100, సూడోమోనస్ ఫోరోసెన్స్ కిలో రూ.150, ట్రైకోగమ్మా కార్డు రూ.40 నామమాత్రపు ధరలతో పంపిణీ చేస్తున్నారు. రాష్ట్రంలోనే మొదటగా 1993లో ఈ ప్రయోగశాలను ఏర్పాటు చేశారు. గత నాలుగేళ్లలో ఈ విభాగానికి ప్రభుత్వ సహకారం బాగా ఉండటంతో రైతన్నలకు చక్కని సేవలందుతున్నాయి. ఈ ఏడాది ట్రైకోడెర్మావిరిడి 60 టన్నులు, సూడోమోనస్‌ఫోరోసెన్స్ 12 టన్నులు పొలంబడి, ఎస్‌ఎఫ్‌ఎస్‌ఎం, ఆర్‌బీకేలు తదితర ప్రభుత్వ కార్యక్రమాల ద్వారా పంపిణీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

> **విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం**
>
> 
>
> మిత్ర శిలీంద్రాలైన విరిడి, సూడోమోనస్ ఉపయోగాలపై ఇప్పటికే రైతన్నలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం. జీవనియంత్రణ పద్ధతుల్ని అవలంబిస్తే పలు తెగుళ్ల నివారణకు అయ్యే అధిక వ్యయాన్ని నివారించటంతో పాటు పర్యావరణానికి మేలు కలుగుతుంది. జీవమందుల్ని ప్రయోగశాలలో నిరంతరం ఉత్పత్తి చేస్తున్నాం. ఉమ్మడి అనంతపురం, వైఎస్సార్ జిల్లాల నుంచి సైతం వచ్చి ఇక్కడి ఉత్పత్తులను తీసుకువెళుతున్నారు. మిరప, శనగ, పసుపు, అరటి, పండ్లతోటలు సాగుచేసే రైతులు ప్రయోగశాలకు ఎక్కువగా కొనుగోలుకు వస్తుంటారు వీటిని ఉత్పత్తి చేసిన 6 మాసాలలోపు వాడుకోవటం ఉత్తమం.
>
> – ఎస్.సుధాకర్, సహాయ సంచాలకులు, జీవ నియంత్రణ ప్రయోగశాల

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ అజెండా



సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే,



గర్భిణులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే

ఆళ్లగడ్డ: ప్రజా సంక్షేమమే అజెండాగా..ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలపై ప్రజలందరూ వంద శాతం సంతృప్తిగా ఉన్నారని, గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి వస్తున్న విశేష స్పందనే దీనికి నిదర్శనమని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని పుల్లారెడ్డిపేటలోని పలు వీధుల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కాలనీలో ప్రతి ఇంటి వద్ద ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు ఒక్కో కుటుంబానికి ఏఏ పథకాల ద్వార ఎంత మేర లబ్ధి చేకూరిందనే విషయాన్ని ఎమ్మెల్యే స్వయంగా చదివి వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నాయబ్‌రసూల్, పార్టీ పట్టణ ఇన్‌చార్జ్ సుధాకర్‌రెడ్డి,నరసింహారెడ్డి, సింగం వెంకటేశ్వర్‌రెడ్డి ఉన్నారు.

మాతా, శిశు సంక్షేమమే ధ్యేయం

మాతా, శిశు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. మహిళాభివృద్ధి ,శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో టేక్ హోమ్ రేషన్ పంపిణీ ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా బుధవారం పట్టణంలోని 4వ సచివాలయ ఆవరణలో సీడీపీఓ తేజేశ్వరి అధ్యక్షతన ఏర్పాటు సమావేశానికి ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరై లబ్ధిదారులకు కిట్లు పంపిణీ చేశారు. మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు ఉన్నారు.

షో కోసమే బాబు ప్రాజెక్ట్ యాత్రలు



గంగులను సన్మానిస్తున్న కార్యకర్తలు

శిరివెళ్ల: షో కోసమే మాజీ సీఎం చంద్రబాబునాయుడు నీటి ప్రాజెక్టుల సందర్శన యాత్ర చేపట్టారని జలవనరుల శాఖ సలహా దారు గంగుల ప్రభాకరరెడ్డి విమర్శించారు. బుధవారం యర్రగుంట్లలోని మస్తాన్‌షా దర్గాలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు గంగులను ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలు బాబును మరిచిపోయారని, మళ్లీప్రజల గుర్తు చేయాలని వివిధ పేర్లతో యాత్రలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. తన పాలనలో ఏనాడు రైతుల సంక్షేమం కోసం పాటుపడలేదని మండిపడ్డారు. తన హయాంలో ఒక్క నీటి ప్రాజెక్టును నిర్మించలేదని, ఇప్పుడు ప్రచారం కోసం తిరుగుతున్నారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రైతులు సుభిక్షంగా ఉన్నారన్నారు. రైతులు బాబును నమ్మే స్థితిలో లేరన్నారు. శిరివెళ్ల, రుద్రవరం, ఆళ్లగడ్డ రైతుల కోసం రూ. 6 కోట్లతో చేపట్టిన ఆయకట్టు రోడ్ల నిర్మాణం చురుకుగా సాగుతున్నాయని చెప్పారు. శిరివెళ్ల వక్కిలేరు వాగుపై రూ. 8 కోట్లతో హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయన్నారు.దర్గా నిర్వహకుడు శంకర్, సర్పంచు అయ్యలూరి సుభహాన్, ఉప సర్పంచు ప్రతాపరెడ్డి, మాజీ మండల ఉపాధ్యక్షుడు గాజ కృష్ణారెడ్డి, సొసైటీ చైర్మన్ మేరువ చిన్ననాగిరెడ్డి, పురుషోత్తం, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, ఈఓఆర్డీ నాగేంద్ర పాల్గొన్నారు.

భవిష్యత్‌కు రక్షణ..సంపూర్ణ పోషణ



దొర్నిపాడులో సంపూర్ణ పోషణ కిట్లను అందజేస్తున్న జెడ్పీటీసీ శంకుతల

దొర్నిపాడు: గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ బంగారు భవిష్యత్‌కు రక్షణ లాంటిది అని ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి, జెడ్పీటీసీ శకుంతల అన్నారు. బుధవారం మండలంలోని గుండుపాపలలో ఎంపీపీ, దొర్నిపాడులో జెడ్పీటీసీ అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలింతలు, గర్భిణులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను అందజేశారు. సచివాలయ కన్వీనర్లు రాముడు, లక్ష్మి పాల్గొన్నారు.

చాగలమర్రి: స్థానిక న్యూ ఎస్సీ కాలనీలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ సుశీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు జి.లక్ష్మీదేవి, ఎంపీపీ వీరభద్రుడు, వైస్ ఎంపీపీ ముల్లా.రఫీలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మండలంలో 59 అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సుభద్రమ్మ, ఎంపీడీఓ మహబుబ్ దౌలా, స్థానిక వైద్యాధికారులు షేక్.ఇమ్రాన్, పి.అంజలి, హెల్త్ సూపర్‌వైజర్ రామలింగారెడ్డి, స్టాఫ్ నర్స్ గార్లెట్ పాల్గొన్నారు.

నంద్యాలటౌన్: తల్లి పాలను మించిన పోషక ఆహారం లేదని నంద్యాల సర్వజన ఆసుపత్రి సూరింటిండెంట్ డాక్టర్ వరప్రసాదరావు అన్నారు. తల్లి పాల వారోత్సవాల సందర్భంగా మాతా శిశు విభాగంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 6 నెలల వరకు తల్లి పాలు మాత్రమే పిల్లలకు ఆహారంగా ఇవ్వాలని, నీరు, తేనే, గ్లూకోజ్ లాంటి పదార్థాలు ఇవ్వరాదన్నారు. డాక్టర్ అరుణ జ్యోతి, డాక్టర్ శిరీష, మహేంద్రనాథ్ పాల్గొన్నారు. నంద్యాల సేవా ప్రగతి లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సర్వజన ఆసుపత్రిలో బాలింతలు, గర్భిణులకు బ్రెడ్లు పంపిణీ చేశారు.

గోస్పాడు: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే టేక్ హోం రేషన్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ గుర్రాలభాస్కర్, ఇన్‌చార్జ్ తహసీల్దార్ విజయశేఖర్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో బుధవారం అంగన్ వాడీ సూపర్ వైజర్ కుమారి ఆధ్వర్యంలో పౌష్టికాహార పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈఓఆర్డీ అనసూయ, ఎంఈఓ–2 సురేంద్రనాథ్, ఏపీఓ నాగజ్యోతి పాల్గొన్నారు. అలాగే.. మాతా – శిశు మరణాలు అరికట్టేందుకు సిబ్బంది కృషి చేయాలని రాష్ట్రీయ బాల స్వాస్థ్య జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ కాంతారావు నాయక్ అన్నారు. బుధవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని హైస్కూల్ కొట్టాల, కానాల గ్రామాల్లో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు.

శిరివెళ్ల: మండలంలో బుధవారం వైఎస్సార్ సంపూర్ణ పోషణ టేక్ హోమ్ రేషన్ పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో సర్పంచులు సాలమ్మ, సుభహాన్, జింకల నాగన్న, మందాల రాధిక, కందుల మల్లేశ్వరి, దూదేకుల ఉశేనీబీ, పెద్ది రమణయ్య, మరియమ్మ పాల్గొన్నారు.

రుద్రవరం: స్థానిక 7వ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం గర్భిణులు,బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ పంపిణీ చేసినట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవి తెలిపారు. అనంతరం 10రకాల పోషక విలువలున్న పదార్థాలను ఫేస్ యాప్ ద్వారా పంపిణీ చేశారు. హెల్త్ సూపర్ వైజర్ మెల్కమ్మ ఉన్నారు.

ఉయ్యాలవాడ : వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం తల్లీబిడ్డ ఆరోగ్యానికి భరోసానిస్తుందని ఎంపీపీ బుడ్డా భాగ్యమ్మ అన్నారు. బుధవారం స్థానిక 4వ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు సంపూర్ణ పోషణ కిట్లను సర్పంచ్ ఓబులేసోతో కలిసి పంపిణీ చేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దీప్తి మాట్లాడుతూ నెలకు సరిపడ కిలో రాగిపిండి, చిరుధాన్యాల పిండి, అటుకులు, పావు కిలో శనగ చెక్కీలు, బెల్లం, ఎండుఖర్జూరాలతో కూడిన కిట్లను కేంద్రాలకు రాలేని వారికి గృహాల వద్దకే అందజేస్తున్నామని చెప్పారు.

సీమకు జలసిరులు పంచిన ఘనత వైఎస్సార్‌దే

- పోతిరెడ్డిపాడు ఎత్తు పెంపుపై నాడు చంద్రబాబు గగ్గోలు
- జిల్లా రైతులు ఆయనను ఎప్పటికీ నమ్మరు
- వైఎస్సార్‌సీపీ రైతు విభాగం నంద్యాల జిల్లా అధ్యక్షుడు శిరుప శ్రీనివాస రెడ్డి



నంద్యాల(సెంట్రల్): జలయజ్ఞం లో భాగంగా సాగునీటి ప్రాజెక్టుల్ని పూర్తి చేసి దశాబ్దాల సీమ కరవుకు శాశ్వత పరిష్కారం చూపిన ఘనత వైఎస్సాకే దక్కుతుందని వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు శిరుప శ్రీనివాసరెడ్డి గుర్తు చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఇతరుల కష్టఫలాన్ని తన ఘనతగా చెప్పుకోవటం మాజీ సీఎం చంద్రబాబు నాయుడుకు అలవాటేనని ఎద్దేవా చేశారు. గతంలో పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ ఎత్తు పెంపుతో కరువు పీడిత రాయలసీమ జిల్లాల్లోని దుర్భిక్ష ప్రాంతాలకు సాగు, తాగునీరు అందించాలని నాటి సీఎం వైఎస్సార్ ప్రణాళికలు రూపొందించారన్నారు. కానీ కుటిల రాజకీయంతో ఈ ఆలోచనకు వ్యతిరేకంగా అప్పటి తెలంగాణ తెదేపా నేతలతో ధర్నా చేయించి నానా యాగీ చేశారని ధ్వజమెత్తారు. దెయ్యాలు వేదాలు వల్లించినట్లు...తన పాలనా కాలమంతా కార్పొరేట్లు, పెత్తందారులతో దోస్తీలో గడిపి వ్యవసాయ రంగాన్ని గాలికొదిలేసిన చంద్రబాబుకు ఇప్పుడు కొత్తగా సాగునీటి ప్రాజెక్టులు గుర్తుకు రావటం కుటిల రాజకీయంలో భాగమేనని వెల్లడించారు. తండ్రి ఆశయాల్ని కొనసాగిస్తూ ప్రస్తుత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పోతిరెడ్డిపాడు ప్రాజెక్టు సామర్థ్యాన్ని 44 వేల క్యూసెక్కుల నుంచి 80 వేల క్యూసెక్కులకు పెంచటంతో పాటు, కృష్ణా నదిపై ఆధారపడిన హంద్రీ–నీవా, ముచ్చుమర్రి, గోరుకల్లు, అవుకు, గండికోట, మైలవరం తదితర జలాశయాలన్నింటినీ నాలుగేళ్లలో పూర్తిస్థాయిలో నింపి అన్నదాతలను ఆదుకుంటున్నారని కొనియాడారు. ఆయన మాటలను రాయలసీమ ప్రజలు నమ్మరని, మరోసారి ఆపార్టీకి శృంగభంగం తప్పదని జోస్యం తప్పదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం తీసుకుంటున్న ప్రత్యేక శ్రద్ధ కారణంగా సీమలోని 8 జిల్లాల్లో ఆహారధాన్యాలు, పండ్ల తోటల ఉత్పత్తులు భారీగా పెరిగి రైతన్నలు సంతోషంగా ఉన్నారన్నారు.

విధులు సక్రమంగా నిర్వర్తించాలి

రుద్రవరం: గ్రామ సచివాలయాల్లో నిర్ణీత వేళలు పాటిస్తూ విధులు నిర్వర్తించాలని ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి సూచించారు. మండలంలోని నర్సాపురం, ముత్తలూరు, మందలూరు గ్రామ సచివాలయాలను బుధవారం పరిశీలించారు. ఆయా సచివాలయాల్లో రికార్డులు, సిబ్బంది హాజరు,సమస్యలపై వచ్చిన దరఖాస్తులు, పరిశీలించినవి, పెండింగ్‌లో ఉన్నవి తదితర వాటికి సంబంధించిన రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రతి రోజూ మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహించాలని ఆదేశించారు. వర్షా కాలం కావడంతో ఆయా గ్రామాల్లో పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలని చెప్పారు. పీఆర్ ఏఈ వెంకటరాముడు ఉన్నారు.

జిల్లా స్థాయి ఫుట్ బాల్ జట్ల ఎంపిక

నంద్యాల(న్యూటౌన్): 13 ఏళ్లలోపు వయస్సున్న బాల బాలికలకు నంద్యాల జిల్లా స్థాయి ఫుట్‌బాల్ జట్ల ఎంపిక ఈ నెల 6వ తేదీన నిర్వహిస్తున్నట్లు జిల్లా సంఘం గౌరవ అధ్యక్షులు డాక్టర్ జీ రవికృష్ణ, వినయ్ సాగర్, అనిల్‌బాబు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. క్రీడాకారులు 2011 జనవరి 1 తరువాత జన్మించి ఉండాలన్నారు. ఒరిజినల్ బర్త్ సర్టిఫికేట్, ఆధార్ కార్డుతో రావాలని సూచించారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఈ నెల 4న సాయంత్రం ఎస్పీజీ మైదానంలో హాజరు కావాలని వివరాలకు సెల్ 9963636876, 998522025 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

వంద శాతం డీవార్మింగ్ చేయాలి

చాగలమర్రి: మండలంలో 2 –19 సంవత్సరాల వయస్సులోపు పిల్లలందరికీ వందశాతం డీవార్మింగ్ పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ మహబూబ్‌దౌలా, ఎంఈఓ అనురాధ సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ప్రభుత్వ వైద్యాధికారి షేక్.ఇమ్రాన్ 10,011 డీవార్మింగ్ మాత్రలను వారికి అందజేశారు. వారు మాట్లాడుతూ మండలంలో 19 సంవత్సరాలలోపు పిల్లలు 10,041 మంది ఉన్నారని, వారందరికీ ఈ నెల 10న జాతీయ డీవార్మింగ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని వంద శాతం పూర్తి చేయాలని చెప్పారు. ఈఓపీఆర్‌డీ సుదర్శనరావు, హెల్త్ సూపర్‌వైజర్ రామలింగారెడ్డి పాల్గొన్నారు.

నటనతో మెప్పించిన బళ్లారి రాఘవ



ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో బళ్లారి రాఘవ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

నంద్యాల(సెంట్రల్): తనకే సొంతమైన అభినయంతో నటనకు సరికొత్త భాష్యం చెప్పిన నటుడిగా బళ్లారి రాఘవ కలకాలం గుర్తుండి పోతారని నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం సహ సంచాలకులు ఎన్‌సీ.వెంకటేశ్వర్లు కొనియాడారు. బుధవారం స్థానిక ఆర్‌ఏఆర్‌ఎస్ ప్రాంగణంలో నటుడు, ప్రయోక్త, నాటక రచయిత బళ్లారి రాఘవ 144వ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఏడీ మాట్లాడుతూ న్యాయవాదిగా మంచి ఆదాయార్జనకు అవకాశమున్నా, కళా రంగంపై మక్కువతో నటనపై ఆసక్తి పెంచుకుని రాణించారన్నారు. తన నటనా చాతుర్యంతో ఓసారి సాక్షాత్తూ మహాత్మాగాంధీనే మెప్పించిన ప్రతిభాశాలిగా కీర్తి గడించారని గుర్తు చేశారు. ఆర్‌ఏఆర్‌ఎస్ శాస్త్రవేత్తలు, వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


యాజమాన్య పద్ధతులు పాటించాలి

నంద్యాల(సెంట్రల్): వరి నారుమడుల సస్యరక్షణకు సరైన యాజమాన్య పద్ధతులు పాటించాలని నంద్యాల ఏడీఏ(ఇన్‌చార్జ్) హేమసుందరరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది వర్షాలు ఆలస్యమవ్వటంతో నారు మొలకెత్తడం వివిధ దశల్లో ఉందన్నారు. సరైన జాగ్రత్తలు తీసుకుంటే మడుల్లో తెగుళ్లను నివారించవచ్చన్నారు. జింకు, ఇనుపధాతు లోపాలు కనిపిస్తున్నాయని..ఆకులు పసుపు వర్ణంలోకి మారి ఇటుక రంగు మచ్చలతో ఉంటే జింకుధాతు లోపంగా గుర్తించాలని, నివారణకు.. రెండు గ్రాముల జింక్ సల్ఫేట్ పిచికారీ చేయాలని సూచించారు. ఆకులు పాలిపోయి తెల్లగా మారి ఉంటే ఇనుపధాతు లోపంగా గుర్తించి రెండు గ్రాముల అన్నబేదితో పాటు 2గ్రాముల నిమ్మ ఉప్పు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని చెప్పారు. పచ్చిరొట్ట ఎరువు దున్నే ముందు ఎకరానికు కనీసం 50 కిలోల సూపర్ పాస్ఫేట్ చల్లితే త్వరగా ఎరువుగా మారుతుందని వివరించారు.

మహిళకు న్యాయం చేయాలి

నంద్యాల(న్యూటౌన్): నకిలీ సర్టిఫికెట్లతో మరొకరికి ఉద్యోగం ఇచ్చారని విచారణ జరిపించి అర్హులైన మహిళకు న్యాయం చేయాలని సీపీఐ జిల్లా నాయకుడు రమేష్ బాబు విద్యాశాఖ అధికారులను కోరారు. బుధవారం పట్టణంలోని డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 2019 ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ గ్రంథాలయం పోస్టు భర్తీలో నకిలీ 8వ తరగతి సర్టిఫికెట్లు పెట్టి అక్రమమార్గంలో నాగభాస్కర్ అనే వ్యక్తికి ఉద్యోగం పొందాడని, దీంతో పారుమంచాల గ్రామానికి చెందిన స్వర్ణలత నష్టపోయిందని చెప్పారు.

ఆర్బీకేలతో రైతులకు ఉపయోగం



మాట్లాడుతున్న భరత్‌కుమార్‌రెడ్డి

గోస్పాడు: రైతు భరోసా కేంద్రాలు రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని నంద్యాల జిల్లా వ్యవసాయ, అనుబంధ రంగాల సలహా కమిటీ చైర్మన్ వంగల భరత్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని నెహ్రూనగర్ గ్రామ ఆర్బీకేలో మండల, గ్రామ స్థాయి సలహా కమిటీ చైర్మన్లతో సమావేశం నిర్వహించారు. ఎంపీపీ ఆర్థర్ సైమాన్, వ్యవసాయ సలహా కమిటీ మండల చైర్మన్ జనార్ధన్‌రెడ్డి, ఏడీఏ రామ్మోహన్‌రెడ్డి, ఏఓ స్వప్నిక పాల్గొన్నారు.

నంద్యాలలో ఏర్పాటు చేయాలి..

నంద్యాల(న్యూటౌన్): కేంద్రీయ విద్యాలయాన్ని జిల్లా కేంద్రం నంద్యాలలో ఏర్పాటు చేయాలని, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 5వ తేదీన డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ధనుంజయుడు తెలిపారు. స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడారు.

స్పందన అర్జీలపై నిర్లక్ష్యం తగదు

ఉయ్యాలవాడ : ప్రజా సమస్యలపై స్పందనలో వచ్చిన అర్జీలకు అధికారులు జవాబుదారీగా ఉండి పరిష్కార దశలో పని చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని తహసీల్దార్ రవికుమార్ మండల స్థాయి అధికారులకు సూచించారు. బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన స్పందన సమీక్షపై ఆయన మాట్లాడుతూ శాఖల పరంగా ఏఏ శాఖకు ప్రజల నుంచి వచ్చిన వినతులపై ఆయా శాఖాధికారులను అడిగి తెలుసుకున్నారు. కొందరు అధికారులు మాత్రం సమస్యల పరిష్కార దశలో ఉన్నాయి, త్వరలో పరిష్కరిస్తాం అని తెలపగా మరి కొందరు అధికారులు ఏఏ సమస్యలుపై అర్జీలు కూడా వెంట తీసుకుని రాకుండా కిందిస్థాయి సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులపై నెట్టడంతో వారి పనితీరుపై తహసీల్దార్, ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎస్ఐ సత్యనారాయణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అర్థిక సాయం

శిరివెళ్ల: స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికురాలు జోతమ్మ బుధవారం అనారోగ్యంతో మరణించింది. వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు వక్ఫ్ బోర్డు జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు బీ.అబ్దుల్ సలాం రూ.10 వేల ఆర్థిక సాయం మృతురాలి సోదరి ఆంథోనమ్మకు అందజేశారు. సర్పంచు సాలమ్మ, ఉప సర్పంచు ఇంతియాజ్, చంద్ర పాల్గొన్నారు.